
## మైనర్ డ్రైవింగ్‌పై అధికారుల చర్యలు



2





2

## మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు తప్పిన ప్రమాదం



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వచ్చే ఏడాది జూన్, జూలై మాసాల్లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాలు 2027 ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ నుంచి వీసీలో మాట్లాడారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్‌పాకల్ పుష్కర ప్రదేశాల వద్ద చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన వసతులపై చర్చించారు. పోచంపాడ్ పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీఐపీలు, వీవీఐపీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.


14-7-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం..

### మెండోరా ఆర్ఐపై కలెక్టర్ వేటు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ ఇలా త్రిపాఠి కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై వేటు వేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట ఇసుకను అక్రమంగా దారి మళ్లించాడనే ఫిర్యాదు మేరకు మెండోరా రెవెన్యూ ఇన్ స్పెక్టర్ (ఆర్ఐ) సదానంద్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు గట్టి నిఘా కొనసాగిస్తున్న విషయం విదితమే. 'మన ఇసుక వాహనం' బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే ఇసుక తరలింపునకు అనుమతులు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెండోరా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సదానంద్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట ఇసుక తరలింపునకు అనుమతులు పొంది, ఇసుక నిల్వలను దారి మళ్లిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఈ విషయమై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను సైతం అధికారులతో వాకబు చేయించగా, తమకు ఇసుక అందలేదని వెల్లడించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, మెండోరా రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సదానంద్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

## 'ఆమె' స్థానంలో దర్జాగా..!



- హద్దు మీరుతున్న కొందరు 'సర్పంచ్ భర్తలు'
- గ్రామాల్లో వారిదే పెత్తనం..
- చక్రం తిప్పుతూ.. పంచాయితీలు తెంపుతూ..
- మహిళా సర్పంచ్‌గిరీకి మచ్చతెస్తున్న కొందరు..

**స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళలు నామమాత్రంగా మారుతున్నారు. వారి కుటుంబ సభ్యులే 'అంతా తామై' పెత్తనం చెలాయిస్తున్నారు. పంచాయతీ పాలనలో తమ 'మార్క్' చూపిస్తున్నారు. అధికారిక సమావేశాల్లో దర్జాగా ఆసీనులవుతూ.. అధికారులకు ఆదేశాలు సైతం ఇస్తున్నారు. గ్రామానికి ఓ మహిళా సర్పంచ్ ఉన్నదనే విషయాన్ని మైమరిపిస్తూ అసలు సిసలైన నేతలుగా చెలామణి అవుతున్నారు.** - అక్షరటుడే, డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలం లో జాతీయ రహదారి పక్కనున్న ఓ గ్రామంలో మహిళా సర్పంచ్ భర్త.. పంచాయతీ పాలనలో అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. పంచాయతీ పాలక వర్గ సమావేశంలో కూర్చుని ఆదేశాలు ఇస్తున్నాడు. ఏదైనా పని ఉంటే తన ఇంటికి వచ్చి కలవాలని సిబ్బందిపై అజమాయిషీ ప్రదర్శిస్తూ పెత్తనం చెలాయిస్తున్నాడు. తన మాట వినని సిబ్బందిపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడు. ఆ సర్పంచ్ భర్త వ్యవహార శైలిపై గ్రామస్థులు ఆగ్రహంతో ఉన్నారు.

### తీర్మానాల్లో జోక్యం

గ్రామ పంచాయతీ తీర్మానాల రిజిస్టర్లలో సంతకాలు పెట్టడానికి మాత్రమే మహిళా సర్పంచులు కార్యాలయానికి వస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే భర్తలే సంతకాలను కూడా ఫోర్జరీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండల పరిషత్ సమావేశాలకు, జిల్లాస్థాయి రివ్యూ మీటింగ్‌లకు మహిళా సర్పంచులకు బదులుగా వారి భర్తలే హాజరవుతున్నారు. అధికారులు కూడా దీనిని చూసీచూడనట్లు వదిలేయడం ఈ సంస్కృతికి మరింత ఊతమిస్తోంది.

### చట్టసభల్లో సగం.. పాలనలో మాత్రం శూన్యం

ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. మహిళలు రాజకీయంగా ఎదగాలని, సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ గ్రామాలను ప్రగతి పథంలో నడపాలనేది ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. అయితే మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో భర్త జోక్యం మితిమీరిందని కలెక్టర్ ఏకంగా మహిళా సర్పంచ్‌ను సస్పెండ్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ క్రమంలో జిల్లాలో సైతం పలువురు సర్పంచుల భర్తల తీరుపై చర్చ జరుగుతోంది.

### నిజామాబాద్ జిల్లాలోనూ..

నిజామాబాద్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. 545 గ్రామ పంచాయతీలుండగా 249 మంది మహిళా సర్పంచులు ఎన్నికయ్యారు. ఇక్కడ మహిళలు పేరుకే సర్పంచులుగా.. కానీ, తెర వెనుక, తెర ముందూ అంతా తామై నడిపిస్తోంది మాత్రం వారి భర్తలు, కుమారులే కావడం గమనార్హం. జిల్లాలోని మెజారిటీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సర్పంచుల పరిస్థితి కేవలం 'రబ్బరు స్టాంపు'లకే పరిమితమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మహిళా సర్పంచుల కోసం కేటాయించిన అధికారిక కుర్చీల్లో కొందరు వారి భర్తలు దర్జాగా కూర్చుని హుకూం జారీ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల భార్య కుర్చీ పక్కనే అంతకంటే పెద్ద కుర్చీ వేయించుకుని సమాంతర పాలన సాగిస్తున్నారు.

### పంచాయతీ సిబ్బందిపై వేధింపులు

సర్పంచుల భర్తల మితిమీరిన జోక్యంతో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, సఫాయి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'మేం మహిళా సర్పంచ్‌కు నివేదిక ఇచ్చేందుకు వెళ్తే, ఆమె భర్త నివేదిక లాక్కుని మమ్మల్ని ప్రశ్నిస్తారు. ఆయన చెప్పినట్లు వినకుంటే ఎమ్మెల్యేకు చెప్పి బదిలీలు చేయిస్తామని బెదిరిస్తున్నారు.' అని కొందరు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అభివృద్ధి పనుల బిల్లుల మంజూరు, లబ్ధిదారుల ఎంపిక, గ్రామ నిధుల దుర్వినియోగం వంటి విషయాల్లో భర్తల మాటే శాసనంగా మారింది. గ్రామ సభల్లో మహిళా సర్పంచ్‌లను మూలన కూర్చోబెట్టి, మైక్ పట్టుకుని భర్తలే ప్రసంగాలు దంచేస్తున్నారు.
సర్పంచుల భర్తల ఆగడాలపై పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారులకు అంతర్గతంగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

### ఇంటెలిజెన్స్ నివేదికలు

మెదక్ జిల్లా పొలంపల్లి ఘటన నిజామాబాద్ జిల్లా యంత్రాంగాన్ని అలర్ట్ చేసింది. జిల్లాలోని పలు మండలాల్లో మహిళా సర్పంచుల భర్తల జోక్యంపై ఇంటెలిజెన్స్, పంచాయతీ రాజ్ శాఖ అంతర్గత నివేదికలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కడైనా భర్తల పెత్తనం కనిపిస్తే సదరు మహిళా సర్పంచ్‌లను సస్పెండ్ చేయాలని భావిస్తున్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఎన్నుకోబడిన ప్రతినిధి మాత్రమే విధులను నిర్వహించాలి. సర్పంచ్ విధుల్లో ఇతరులు జోక్యం చేసుకుంటే అది చట్టవిరుద్ధం. జిల్లాలో 'సర్పంచ్ పతి'ల పెత్తనానికి చెక్ పెట్టకపోతే.. మహిళా రిజర్వేషన్ల ఆశయం అభాసుపాలు కావడం ఖాయం. ఇప్పటికైనా కలెక్టర్, పంచాయతీ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.



## రహత్‌నగర్‌లో చురుగ్గా సాగుతున్న సబ్‌స్టేషన్ పనులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రహత్ నగర్ గ్రామంలో నూతన సబ్ స్టేషన్ పనులు చురుకుగా సాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. త్వరలోనే సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏడీఈ కన్‌స్ట్రక్షన్ తోట రాజశేఖర్ మాట్లాడుతూ.. పీసీసీ చీఫ్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఏఈ శ్రావణ్ కుమార్, ఏఈ ట్రాన్స్‌ఫార్మర్ సాయిలు, లైన్‌మన్ మోహన్, సర్పంచ్ లకావత్ తిరుపతి, ఉప సర్పంచ్ భుక్య సేవలాల్, వీడీసీ బాదావత్ గోపాల్, రాములు, గ్రామ పెద్దలు బాదావత్ బాలు, శర్మ నాయక్, మోహన్ నాయక్, రాములు, రమేష్ కాంట్రాక్టర్ సతీష్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వైద్యుల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆగ్రహం..

### బాన్సువాడ మాతాశిశు ఆస్పత్రి ఎదుట ధర్నా

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మాతాశిశు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మాతా-శిశు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత శుక్రవారం, శనివారం రెండు రోజుల్లో పదిమంది గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహించగా, వారిలో ఐదుగురు ఆపరేషన్ అనంతరం తీవ్ర అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. వారిని మొదట నిజామాబాద్ కు, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాల్సి వచ్చిందని తెలిపారు. ముగ్గురికి కిడ్నీ ఇన్ఫెక్షన్ సోకడంతో డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ ఘటనలకు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపించిన నాయకులు, గత కొంతకాలంగా ఆస్పత్రిలో కనీస వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో లేవని విమర్శించారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, బాడి శ్రీనివాస్, ఖలీల్, అక్బర్, ఫిరోజ్, గణేష్, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






## ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాలల బంద్ విజయవంతం

**అక్షరటుడే, ఇందూరు:** ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయనందుకు నిరసనగా జిల్లాలో నిర్వహించిన కళాశాలల బంద్ విజయవంతమైందని ఏబీవీపీ ఇందూరు జిల్లా కన్వీనర్ అక్షయ్ పేర్కొన్నారు.ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌పై ఆధారపడి చదువుకుంటున్నారన్నారు. ప్రస్తుతం రూ.11,000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని అగ్రహం వ్యక్తం చేశారు.

## తాగునీటిని వృథా చేస్తే జరిమానా విధిస్తాం: కలెక్టర్ హెచ్చరిక





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో ఎక్కడ కూడా తాగునీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా తాగునీటిని వృథా చేస్తే జరిమానాలు విధిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం తాగునీటి సరఫరా, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల పెంపుదల తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో రూ.10 వేలు, గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 5వేల జరిమానా విధించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా అధికారులతో జిల్లాలో ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, శ్రీరాంసాగర్ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగు, సాగునీటి అవసరాలకు అవి ఏ మేరకు సరిపోతాయనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి తాగునీటిని ఏమాత్రం వృథా చేయకుండా, భవన నిర్మాణాలు వంటి ఇతర అవసరాలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటిని వృథా చేస్తే, బాధ్యులకు జరిమానాలు విధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## ఉపాధ్యాయులపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తున్నాం : దినేష్ కులాచారి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. విద్యారంగా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తపస్ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద చేస్తున్న ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. అన్నం పెట్టే రైతాంగం వర్షాలు లేక ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. విద్యను అందించే ఉపాధ్యాయులు సైతం తమ న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి రావడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని దినేష్ అన్నారు. రాష్ట్రంలో ఆరు డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి నేడు సీఎం అయ్యాక విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు కిషన్ రెడ్డి, మధుసూదన్ చారి, వరప్రసాద్, బద్రీనాథ్, కృష్ణవేణి, కవిత తదితరులు పాల్గొన్నారు.





## బాధితులకు తక్షణ న్యాయం అందించడమే ప్రథమ కర్తవ్యం : ఎస్పీ రాజేష్ చంద్ర



**అక్షరటుడే, కామారెడ్డి :** బాధితులకు తక్షణ న్యాయం అందించడమే తమ ప్రథమ కర్తవ్యమని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. మంగళవారం కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించిన తర్వాత శాంతిభద్రతలు, పెండింగ్ కేసులు, ప్రజా సేవలపై ఎస్పీ చర్చించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడితో మర్యాదగా వ్యవహరించి సమస్యలను వేగంగా పరిష్కరించాలని, దీనివల్ల ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం పెరుగుతుందని అధికారులకు సూచించారు. నమోదైన ప్రతి కేసు దర్యాప్తును నాణ్యతతో పూర్తి చేసి పెండింగ్ కేసులను తగ్గించాలని ఆదేశించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలపై గ్రామాలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించి బాధితులకు భరోసా ఇవ్వాలని, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు, రాత్రి గస్తీని పటిష్టం చేయాలని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ ఎస్సై చంద్రశేఖర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మధుసూదన్, టౌన్ ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ.. నీటి సరఫరాకు అంతరాయం

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడనుంది. భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడడంతో తాగునీటి సరఫరాను మూడు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. పైపులైన్ మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు తాగునీటి అవసరాల కోసం స్థానికంగా ఉన్న మున్సిపాలిటీ బోర్లను వినియోగించుకోవాలని సూచించారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని కమిషనర్ వెల్లడించారు. ప్రజలు సహకరించి, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నిజాంసాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి



**అక్షరటుడే, కోటగిరి :** నిజాంసాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోతంగల్ మండల బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల అధ్యక్షుడు కల్లూరి హన్మాండ్లు (బజరంగ్) మాట్లాడుతూ.. కష్టపడి వరి నాట్లు వేసిన రైతులు వర్షాలు పడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెపారు. బోర్లు ఎత్తిపోయి పొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు కోతలను విధిస్తూ రైతులకు ఇబ్బంది పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి గోదావరి నది జలాలను తీసుకొచ్చి నిజాంసాగర్ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. గంగాధర్ పటేల్, సంతోష్ పటేల్, గంధపు హన్మాండ్లు, మక్కయ్య, కిరణ్, అర్జున్, రాజు, రాములు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మైనర్ డ్రైవింగ్‌పై

# అధికారుల చర్యలు

మైనర్ డ్రైవింగ్‌పై అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నారు. అంతేగాకుండా వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. పలువురు తల్లిదండ్రులు ఇంటి పనులు, ఇతర అవసరాల కోసం పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. అయితే మైనర్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతుండటంతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు.

**- అక్షరటుడే, నిజామాబాద్ క్రైం**

- **నిజామాబాద్ జిల్లాలో 283 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు**
- **ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు**
- **వాహన రిజిస్ట్రేషన్ల రద్దులో రెండోస్థానంలో నిజామాబాద్**
- **ప్రజల్లో మార్పు రావాలంటున్న అధికారులు**

జిల్లాలో మైనర్ డ్రైవింగ్‌పై పోలీసులు, ఆర్టీఏ అధికారులు కఠినచర్యలు తీసుకుంటున్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే తల్లిదండ్రులు లేదా వాహన యజమానులకు సంబంధించిన బైక్‌ల రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తున్నారు. అయినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తే క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు.

### రాష్ట్రంలోనే రెండోస్థానం..

మోటారు వాహనాల చట్టం, సుప్రీంకోర్టు నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్న రవాణాశాఖ అధికారులు ఇటీవల దూకుడు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా మైనర్లు నడిపిన వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తూ వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో అత్యధికంగా 3,523 వాహనాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. రెండో స్థానంలో నిజామాబాద్ నిలవడం గమనార్హం. 2025 జూన్ నుంచి ఇప్పటివరకు జిల్లాలో 283 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు చేశారు.

### ప్రమాదాలకు కారణం

కామారెడ్డి మండలం ఇల్చిపూర్ శివారులో గతనెల 16ఏళ్ల మైనర్ నడిపిన బైక్ ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎదురుగా వస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మైనర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లాలోనూ మైనర్ డ్రైవింగ్ ఘటనలు విపరీతంగా పెరిగిపోయాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వివిధ పనుల నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా బైక్‌లను వినియోగిస్తున్నారు. మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. నగరంలోని ఆయా కాలనీల్లో నిత్యం ఏదోఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఒక మైనర్ వాహనాన్ని డ్రైవ్ చేస్తూ పట్టుబడితే ఆ వాహన యజమాని లేదా సంరక్షకుడిని నేరస్తుడిగా పరిగణిస్తారు. జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.. అలాగే వాహనం రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు.

### వారి ముచ్చట తీర్చే మార్గం ఇదేనా..!

చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు అడగగానే బైక్‌లు కొనిస్తున్నారు. వారు మైనర్లని.. రోడ్లపైకి బైక్‌లతో వెళ్తే ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసి కూడా ఇలాంటి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. పిల్లలు అడిగిన తర్వాత కొనివ్వకపోతే ఏమవుతుందోననే నెపంతో వారికి బైక్‌లు అప్పజెప్పేస్తున్నారు. కొన్ని ఏరియాల్లో అమ్మాయిలు సైతం బైక్‌లపై వేగంగా వెళ్తూ కనిపిస్తున్నారు. బైక్ కొనివ్వమని వారు మారం చేస్తే సర్దిచెప్పి బాగా చదువుకున్నాక అన్ని ఇప్పిస్తామని చెప్పాల్సిన తల్లిదండ్రులే పిల్లలు ప్రమాదాలకు గురికావడానికి కారణమవుతున్నారు.

### నిబంధనలు కఠినంగా అమలు చేస్తాం

మైనర్లు వాహనాలు నడిపిన కారణంగా గతేడాది జూన్ నుంచి ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లా పరిధిలో 283 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు చేశాం. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. మైనర్లు ఎక్కడైనా బైక్‌లు, ఇతర వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడితే ముందుగా సంబంధిత వాహనాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తాం. వాహనాలు ఇచ్చిన యజమానులపై చర్యలు కూడా తప్పవు. మైనర్లు వాహనాలు నడపడం కారణంగా వారితో పాటు ఇతరుల ప్రాణాలకు సైతం ప్రమాదం పొంచిఉంది. కాబట్టి పెద్దలు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు. రవాణాశాఖ ఆధ్వర్యంలో నిత్యం తనిఖీలు జరుగుతూనే ఉంటాయి. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

**– దుర్గా ప్రమీల, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్**

## ఇంటింటికీ చేరుతున్న కాంగ్రెస్ ఫలాలు



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** కాంగ్రెస్ పాలనలో ప్రతీ ఇంటికీ ప్రభుత్వ ఫలాలు చేరుతున్నాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి పొలాసాని శ్రీనివాస్ అన్నారు. డిచ్‌పల్లి మండలం కమలాపూర్, మిట్టాపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గ్రామ శాఖ అధ్యక్షులు లింబాద్రి, రాజన్న ను సన్మానించారు. మండలాధ్యక్షుడు అంబర్ సింగ్, డా. షాదుల్లా, జహూర్, డిచ్‌పల్లి సొసైటీ ఛైర్మన్ రాంచందర్ గౌడ్, నాయకులు గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## భీమన్న ఆలయంలో విగ్రహాలకు నిప్పు..

**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని పోచంపాడ్ (సోన్ పేట్) భీమన్న ఆలయంలో గల భీమన్న గజాలకు (చెక్కబొమ్మలు) మంగళవారం దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న బాల్కొండ సీఐ జాన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనను పరిశీలించి వివరాలు సేకరించారు. ఎస్సై సుహాసిని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ సూచించారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌ను సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న నీటి శుద్ధి ప్రక్రియతో పాటు సరఫరా విధానాన్ని పరిశీలించారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు నిరంతరంగా అందేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. నీటిశుద్ధి ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పంపిణీ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఖలేఖ్, భాస్కర్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




**అక్షరటుడే, బాన్సువాడ:** సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ ప్రత్యర్థులు, రైతులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు హింసను, ఆత్మహత్యలను ప్రేరేపించేలా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు మంగళవారం బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్యాంగబద్ధమైన సీఎం పదవిలో కొనసాగుతున్న వ్యక్తి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజల్లో ఉద్రిక్తతలకు దారితీసేలా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు హింసను ప్రేరేపించేలా కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, సీఎం వ్యాఖ్యలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, ఎర్రవట్టి సాయిబాబా, కౌన్సిలర్ మక్బూల్, మాజీ వార్డు సభ్యులు శ్రీను, అక్బర్, ఫిరోజ్, ఖలీల్, మోచి గణేష్, రమేష్ యాదవ్, చాకలి సాయిలు, శివ సూరి, రహీం తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని మెండోరా గ్రామానికి చెందిన కల్లెడ మమత, కల్లెడ రవికుమార్‌లకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం అందజేశారు. బీజేపీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు అరె రవీందర్ ఈ చెక్కులను వారికి పంపిణీ చేశారు. నిరుపేదల వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా బీజేపీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్ నేతృత్వంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడే నిరుపేద కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీడీసీ ఛైర్మన్ చేగంటి గంగాధర్, ఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు ముస్లి ఎర్రన్న, కార్యదర్శి గజానవేణి మోహన్, బీజేపీ జిల్లా నాయకుడు నాగార్జున్ రెడ్డి, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు తక్కూరి అంజయ్య, సీనియర్ నాయకుడు పార్వతి శ్రీనివాస్ గౌడ్, వాల్గోట్ బాబూరావు, తక్కూరి రామ్, వాల్గోట్ భాస్కర్, నడుకుడ రమేష్, మోహన్, రాములు, దాస్, రాకేష్, ఆదిత్య పాల్గొన్నారు.

## భీమ్‌గల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు తప్పిన ప్రమాదం



**అక్షరటుడే, భీమ్‌గల్ :** భీమ్‌గల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొదిరే నాగమణి ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ నుంచి భీమ్‌గల్ వస్తుండగా మార్గమధ్యంలో కారు అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఛైర్‌పర్సన్ నాగమణి, ఆమె భర్త స్వామి, కుమారుడు, కుమార్తె స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని, క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారంతా క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆర్మూర్ మండలం పిప్రి ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,వాటికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరస్థులను పట్టుకోవడం సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న డిగ్రీ వన్ టైమ్ ఛాన్స్ పరీక్షలు

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ బీఏ/బీకామ్/బీఎస్సీ/బీబీఏ కోర్సుల సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ వన్ టైమ్ ఛాన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం జరిగిన పరీక్షలకు 253 మంది విద్యార్థులకు 233 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 238 మంది విద్యార్థులకు 223 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

## పోచంపాడ్ జెన్‌కో కార్యాలయంలో కొనసాగుతున్న నిరసన




**అక్షరటుడే, మెండోరా:** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ మెండోరా మండలం పోచంపాడ్ జెన్‌కో కార్యాలయంలో ఉద్యోగుల ఆందోళన మంగళవారం 19వ రోజుకు చేరుకుంది. టీజీపీఈజేఏసీ నాయకులు కె. సతీష్, ఎం.డి. రఫీక్, దేవరాజ్, ఎం. ప్రవీణ్, చంద్రశేఖర్, నరేష్, శృతిమ, రాంబాబు, స్వాతి, ఏ.వీ. శ్రీనివాస్ తదితరుల నాయకత్వంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జెన్‌కో ఉద్యోగులకు మద్దతుగా ట్రాన్స్‌కో, డిస్కం ఉద్యోగులు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.